హైదరాబాద్ గ్రాండ్ విక్టరీ

తనయ్ (7/63; 6/81)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హైదరాబాద్.. రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ ఫైనల్‌కు చేరింది. నాగాలాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 68 పరుగుల తేడాతో గెలుపొందింది. హైదరాబాద్ 462/8 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. నాగాలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 206, 188 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లతో అదరగొట్టిన తనయ్ త్యాగరాజన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ మరో 6 వికెట్లు ఖాతాలో వేసుకోవడంతో.. ప్రత్యర్థి కనీస ప్రతిఘటన లేకుండానే వెనుదిరిగింది. ప్లేట్ గ్రూప్‌లో ఇప్పటి వరకు ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లోనూ హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయాలు సాధించడం విశేషం.

ఇలాగే దూసుకెళ్లండి : జగన్‌మోహన్‌రావు

దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో తుదిపోరుకు అర్హత సాధించిన హైదరాబాద్ జట్టును హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు అభినందించారు. మ్యాచ్ అనంతరం కెప్టెన్ తిలక్ వర్మతో ఫోన్‌లో మాట్లాడిన జగన్‌మోహన్.. ముమ్ముందు ఇలాంటి ప్రదర్శనలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

శభాష్ సుమిత్

చెన్నై ఓపెన్ టైటిల్ కైవసం



చెన్నై: ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న భారత యువ టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్.. చెన్నై ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో భారత నంబర్‌వన్ నాగల్ 6-1, 6-4తో లూకా నార్డీ (ఇటలీ)పై విజయం సాధించాడు. ఈ ఫలితంతో సోమవారం విడుదల కానున్న ర్యాంకింగ్స్‌లో నాగల్ తొలిసారి టాప్-100లో చోటు దక్కించుకోనున్నాడు. ఈ టోర్నీ ఆరంభం నుంచి అపజయం ఎరగకుండా దూసుకెళ్లిన నాగల్.. ప్రత్యర్థులకు కనీసం ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టైటిల్ నెగ్గడం మరో విశేషం. ఏకపక్షంగా సాగిన తుదిపోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా నాగల్ విజృంభించాడు. 'చాలా సంతోషంగా ఉంది. సొంత అభిమానుల సమక్షంలో ఇలాంటి ప్రదర్శనలు మరింత ఉత్సాహాన్నిస్తాయి' అని నాగల్ అన్నాడు

ఇదీ వాళ్లదే

అండర్-19 చాంపియన్ ఆస్ట్రేలియా • తుదిమెట్టుపై తడబడ్డ భారత్ • 79 పరుగులతో ఓటమి

యువభారత జట్టుకు పరాభవం తప్పలేదు! అద్వితీయ ప్రదర్శనతో అజేయంగా ఫైనల్‌కు చేరిన యంగ్‌ఇండియా.. తుదిపోరులో కంగారూల అడ్డంకిని అధిగమించలేకపోయింది!

నిరుడు సీనియర్ ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో రోహిత్‌సేన పరాజయం పాలవగా.. ఇప్పుడు అదే తరహాలో యంగ్‌ఇండియా కూడా ఆసీస్ చేతిలోనే ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది!

బెనోనీ (దక్షిణాఫ్రికా): అండర్-19 ప్రపంచకప్‌లో అపజయం ఎరగకుండా.. ఫైనల్ చేరిన యువభారత జట్టుకు చివర్లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో యంగ్‌ఇండియా 79 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ టోర్నీలో అడుగుపెట్టి వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన యంగ్‌ఇండియా.. అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. హర్జాస్ సింగ్ (55; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకం సాధించగా.. కెప్టెన్ వైబ్‌గెన్ (48), హ్యారీ డిక్సన్ (42), ఒలీవర్ (46*) రాణించారు. భారత బౌలర్లలో రాజ్ లింబాని 3, నమన్ తివారి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం అండర్ ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన యంగ్‌ఇండియా 43.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఆదర్శ్ (47), మురుగన్ అభిషేక్ (42) కాస్త పోరాడగా.. కెప్టెన్ ఉదయ్ సహరాన్ (8), సచిన్ దాస్ (9), అర్షిన్ (3), ప్రియాన్షు (9), అవవెల్లి అవనీశ్ రావు (0) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో మహ్లీ బ్రాడ్‌మన్, మెక్‌మిలన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. మహ్లీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', ఆసీస్ పేసర్ క్వెన ఎంపెకాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

4 **అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత జట్టు రన్నరప్‌గా నిలువడం ఇది నాలుగోసారి. ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు ఫైనల్ చేరిన యంగ్‌ఇండియా 5 సార్లు ట్రోఫీ చేజిక్కించుకుంది.**

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 253/7 (హర్జాస్ సింగ్ 55, వైబ్‌గెన్ 48; రాజ్ లింబాని 3/38, నమన్ 2/63), **భారత్:** 43.5 ఓవర్లలో 174 ఆలౌట్ (ఆదర్శ్ 47, అభిషేక్ 42; మహ్లీ 3/15, మెక్‌మిలన్ 3/43).

అచ్చం అలాగే!

నిరుడు సొంతగడ్డపై జరిగిన సీనియర్ వన్డే ప్రపంచకప్‌లో రోహిత్‌శర్మ సారథ్యంలోని భారత జట్టు భారీ ఆశలతో అడుగుపెట్టి.. అందుకు తగ్గట్లే పరాజయం ఎరగకుండా ఫైనల్ చేరింది. ఇప్పుడు అచ్చం అదే రీతిలో యువ భారత జట్టు ఒక్క ఓటమి లేకుండానే అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. లీగ్‌దశలో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ రోహిత్‌సేన విజృంభిస్తే.. తాజాగా యంగ్‌ఇండియా కూడా గ్రూప్ దశ, సూపర్ సిక్స్‌లో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించింది. సీనియర్ ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ సెంచరీల మోత మోగిస్తే.. తాజా టోర్నీలో ముషీర్ ఖాన్, సచిన్ దాస్, ఉదయ్, అర్షిన్ శతకాలు నమోదు చేసుకున్నారు. నవంబర్ 19న దాదాపు లక్ష మందికి పైగా అభిమానుల సమక్షంలో అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా టాస్ గెలువగా.. తాజా పోరులోనూ అదే సీన్ రిపీట్ అయింది. అప్పుడు టీమ్‌ఇండియా మొదట బ్యాటింగ్ చేసి 240 పరుగులకు పరిమితమైతే.. ఇప్పుడు 254 పరుగుల లక్ష్యఛేదనలో యంగ్‌ఇండియా తడబడింది. టోర్నీ ఆసాంతం పరుగుల వరద పారించిన కోహ్లీ, రాహుల్, రోహిత్ తుదిపోరులో ఓ మోస్తరుగా ఆడగా.. తాజా మ్యాచ్‌లో టాపార్డర్ వైఫల్యమే దెబ్బకొట్టింది. దీంతో ఆస్ట్రేలియా ఇటీవలి కాలంలో వరుసగా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్, వన్డే ప్రపంచకప్, అండర్-19 ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత్‌పై విజయాలు సాధించింది.

మ్యాక్స్ మోత



అడిలైడ్: ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ (55 బంతుల్లో 120 నాటౌట్; 12 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ సెంచరీతో విజృంభించడంతో వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా టీ20 సిరీస్ విజయం సాధించింది. పరుగుల వరద పారిన పోరులో ఆసీస్ 34 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు చేసింది. మ్యాక్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అనంతరం ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 207 రన్స్ చేసింది.

లంకదే సిరీస్

అసలంక (97*)

పల్లెకెలె: బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన శ్రీలంక.. అఫ్గానిస్థాన్‌పై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో లంక 155 పరుగుల తేడాతో అఫ్గాన్‌ను చిత్తుచేసింది. మొదట లంక 50 ఓవర్లలో 6 వికెట్లకు 308 రన్స్ చేసింది. చరిత అసలంక (97 నాటౌట్), కుషాల్ మెండిస్ (61), సదీర (52), జనిత్ (50) రాణించారు. అనంతరం అఫ్గాన్ 33.5 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. ఇబ్రహీం జద్రాన్ (54), రహ్మత్ షా (63) మాత్రమే ఆకట్టుకున్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఆదివారం బహుమతులు అందజేశారు. 5 వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో 772 పాయింట్లు సాధించిన తెలంగాణ ఓవరాల్ చాంప్‌గా నిలిచింది.

నిఖత్ వెండి వెలుగులు

సోఫియా: రెండుసార్లు ప్రపంచ చాంపియన్, తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల 50 కేజీల ఫైనల్లో ఆదివారం నిఖత్ 2-3తేడాతో సబీనా (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓటమి పాలైంది. తొలి రెండు రౌండ్లు ఇద్దరు బాక్సర్లు ఒకరిపై మరొకరు పంచ్‌లతో విరుచుకుపడ్డారు. నిఖత్ డిఫెన్స్ బలహీనపడ్డ ప్రతిసారీ ప్రత్యర్థి గట్టి పంచ్‌లతో పాయింట్లు కొల్లగొట్టింది. ఇతర మ్యాచ్‌ల్లో అమిత్ పంగల్ (51 కేజీలు), సచిన్ (57 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించగా.. అరుంధతి చౌదరీ (66 కేజీలు), బరున్ సింగ్ (48 కేజీలు), రజత్ (67 కేజీలు) రజత పతకాలు గెలుచుకున్నారు.

వాలీబాల్‌కు గ్రామాల్లో ఫుల్ క్రేజ్: విజయ్ దేవరకొండ

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 11: తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ ఓ వేదికగా నిలుస్తుందని ప్రముఖ చలనచిత్ర నటుడు, హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు సహ యజమాని విజయ్ దేవరకొండ అన్నాడు. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు నూతన జెర్సీని యజమాని అభిషేక్ రెడ్డితో కలిసి విజయ్ ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా రంగారెడ్డి, నెల్లూరు జిల్లాల మధ్య నిర్వహించిన ఓపెన్ మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. తనకు వాలీబాల్ అంటే చిన్నతనం నుంచి చాల ఇష్టమని, అనంతపురం పుట్టపర్తిలో చదువుకునే రోజుల్లో అక్కడి గ్రామీణులతో కలిసి వాలీబాల్ ఆడేవాడినని అన్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్‌కు మంచి గుర్తింపు ఉందని.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ సహాయ పడుతుందని అన్నారు.

బీసీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

బీసీలకు 20 వేల కోట్లు కేటాయించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల వ్యతిరేకి: ఆర్ కృష్ణయ్య

కాచిగూడ,ఫిబ్రవరి 11: బీసీల సర్వోతోముఖాభివృద్ధికి రూ.8 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లకు పెంచేలా బడ్జెట్‌ను సవరించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ఎమ్మెల్యేలతో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో బీసీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని స్పష్టం చేశారు. 56 శాతంగా ఉన్న బీసీలకు తక్కువ కేటాయింపులు చేసి వారి మనోభావాలను కించపరిచారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల వ్యతిరేకి అని ఈ బడ్జెట్‌తో తేటతెల్లమైనదని పేర్కొన్నారు. త్వరలో బీసీల సత్తా ఎమిటో రుచి చూపిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, గవ్వల భరత్‌కుమార్, రాజేందర్, నందగోపాల్, అంజీ, పృద్వీ గౌడ్, సతీశ్, జయంతిగౌడ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న యూపీఎఫ్ కన్వీనర్ రామచంద్రరావు. చిత్రంలో కోకన్వీనర్లు తాడూరి శ్రీనివాస్, రాజారాం యాదవ్ తదితరులు

బడ్జెట్‌లో బీసీలకు మొండి 'చేయి'

యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి చూపారని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీలంటే సీఎం రేవంత్‌రెడ్డికి చులకన భావన ఉన్నదని, అందుకే ఈ బడ్జెట్‌లో ఆ వర్గాల పట్ల చిన్నచూపు చూశారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే బీసీల కోసం ఐదేండ్లకు లక్ష కోట్లు కేటాయిస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో స్వయంగా హామీ ఇచ్చారని తెలిపారు. తీరా తొలి బడ్జెట్‌లో కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 3.4 శాతం మాత్రమే కేటాయించడం బాధాకరమని పేర్కొన్నారు. నోటితో హామీలిచ్చి, నొసటితో బీసీలను వెక్కిరించిన విధంగా బడ్జెట్ ఉన్నదని పేర్కొన్నారు. బీసీలను తెలివి తక్కువవారిగా అంచనా వేస్తున్నారని, అందుకే కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను టిష్యూ పేపర్‌గా పక్కన పడేశారని ధ్వజమెత్తారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వృత్తిదారుల రక్షణకు నూరుశాతం సబ్సిడీతో ప్రవేశపెట్టిన అనేక పథకాలు, రుణాల పంపిణీని కొనసాగిస్తారో లేదో కాంగ్రెస్ పాలకులు తేల్చి చెప్పాలని యూపీఎఫ్ కోకన్వీనర్ తాడూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పూలే సబ్‌ప్లాన్‌ను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని, అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాల్సిందేనని, లేని పక్షంలో ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో యూపీఎఫ్ కోకన్వీనర్ రాజారాం యాదవ్, డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, ఆర్వీ మహేందర్ కుమార్, బొల్ల శివశంకర్, కోల శ్రీనివాస్, అలకుంట హరిబాబు, జంగయ్య, గీతా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నషాలానికి అల్లం, వెల్లుల్లి

- కనివిని ఎరుగని రీతిలో ధరలు
- కిలో వెల్లుల్లి 500, అల్లం 350
- వర్షాభావంతో తగ్గిన దిగుబడులు
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో ధరలకు రెక్కలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): అల్లం, వెల్లుల్లి ధరలు కనివిని ఎరుగని రీతిలో ఘాటెక్కాయి. ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాయి. దీంతో వాటి రుచికి అలవాటుపడ్డ వారు జిహ్వాచాపల్యం చంపేసుకుంటున్నారు. ప్రస్తుతం వెల్లుల్లి కిలో ధర రూ.500 టచ్ చేసింది. అల్లం కూడా కిలో రూ.300 నుంచి రూ.350కి చేరింది. దీంతో వంటి గది నుంచి అల్లం, వెల్లుల్లి మాయమవుతున్నాయి. రెండు వారాల్లోనే వీటి ధరలు రెట్టింపయ్యాయి. గత నవంబర్ మధ్య నుంచి దేశ వ్యాప్తంగా వెల్లుల్లి, అల్లం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. డిసెంబర్‌లో హోల్‌సేల్ మార్కెట్‌లో అత్యంత నాణ్యమైన వెల్లుల్లి ధర రూ.250 ఉండగా రిటైల్ మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.400 వరకు పలికింది. ప్రస్తుతం కిలో రూ.450 నుంచి రూ.500కి ఎగబాకింది. అల్లం ధరలు కూడా కిలో రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతున్నాయి. ఉస్మాన్‌గంజ్ లాంటి హోల్‌సేల్ మార్కెట్లలో ధర తక్కువగా ఉంటుందని వచ్చిన వినియోగదారులు వాటి ధరలు చూసి కంగుతింటున్నారు. వెల్లుల్లి దిగుబడి భారీగా పడిపోవడంతో ధరల స్వైరవిహారానికి కారణం. కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో జూలైలో వేసిన పంట దెబ్బతిన్నదని వ్యాపారులు తెలిపారు. డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో వెల్లుల్లి ధర పెరుగుతున్నది. భారత్‌లోని మొత్తం వెల్లుల్లి ఉత్పత్తిలో దాదాపు 40% వాటా మహారాష్ట్రదే. ప్రస్తుతం పాత స్టాక్ అరకొరగా అందుబాటులో ఉండగా.. కొత్త పంట కోసం మరో రెండు నెలలపాటు నిరీక్షణ తప్పదు. అప్పటివరకూ ధరలు ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నదని హోల్‌సేల్ వ్యాపారాలు చెప్తున్నారు. పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో వ్యాపారులు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

బీసీ సబ్‌ప్లాన్ ఊసేది?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామన్న కాంగ్రెస్ పార్టీ తొలి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దాని ఊసే తీసుకురాలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి వస్తే బీసీ సంక్షేమానికి ప్రతీ ఆర్థిక సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేండ్లకు గాను లక్ష కోట్లు కేటాయిస్తామని, పూలే బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో గొప్పగా పేర్కొన్నదని తెలిపారు. బడ్జెట్‌లో మాత్రం 60 శాతంగా జనాభా ఉన్న బీసీలకు రూ.8,000 కోట్లు కేటాయించడమేంటని ధ్వజమెత్తారు. ఈ నిధులు బీసీల అభ్యున్నతికి ఏమాత్రం సరిపోవడని పేర్కొన్నారు. ఈ 8 వేల కోట్లలో బీసీల, అగ్రకులాల సంక్షేమం, కల్యాణలక్ష్మి నిధులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పుల బకాయిలకు 3,400 కోట్లు ఇవ్వాల్సి ఉన్నదని తెలిపారు. ఇక మిగిలిన కొద్దిమొత్తం నిధులతో బీసీల అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు బీసీల బడ్జెట్‌ను వెంటనే రూ.20 వేల కోట్లకు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని జాజుల డిమాండ్ చేశారు.

ఆగమేఘాలమీద ఆమెకు డిప్యుటేషన్!

- వైద్యురాలి ఎఫ్‌డీఎస్‌పై వైద్యారోగ్య శాఖలో తీవ్ర చర్చ
- జీవోపై వచ్చిన వారిపైనా బదిలీ వేటుతో గందరగోళం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో ఓ వైద్యురాలికి ఇచ్చిన డిప్యుటేషన్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైద్యశాఖలో అన్ని రకాల డిప్యుటేషన్, వర్క్ఆర్డర్స్‌ను రద్దు చేస్తూ ఈ నెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 8వ తేదీ సాయంత్రానికి తిరిగి తమ సొంత పోస్టింగ్‌కు వెళ్లి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ నిర్ణయంతో దాదాపు 2 వేల మంది గురువారం సొంత ప్రాంతాల్లో తిరిగి రిపోర్టు చేశారని తెలిసింది. ఖమ్మం జిల్లా నుంచి డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ ఎంటమాలజిస్టుకు మాత్రం ఈ ఉత్తర్వులు అమలు కాలేదు. ఆమె ఖమ్మం వెళ్లలేదు.. రిపోర్ట్ చేయలేదు. హైదరాబాద్‌లోనే ఉన్నారు. డిప్యుటేషన్లు రద్దు చేసిన రోజే ఆగమేఘాల మీద 'ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్' (ఎఫ్‌ఎస్‌డీ) తయారై గంటల్లోనే ఆమె వద్దకు చేరింది. దీంతో ఆమె జీహెచ్‌ఎంసీలోనే ఉండిపోయారు. దీంతో వైద్యవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది. వాస్తవానికి ఎఫ్‌ఎస్‌డీ కావాలంటే సిబ్బంది ముందుగా సంబంధిత విభాగాధిపతికి వ్యక్తిగతంగా దరఖాస్తు చేయాలి. దానిని పరిశీలించిన తర్వాత ఎఫ్‌ఎస్‌డీ కన్సెంట్ ఇస్తారు. దాని ప్రకారం హెచ్‌వోడీ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఎఫ్‌ఎస్‌డీ ఆర్డర్ రావడానికి సాధారణంగా 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. కానీ, ఈ వైద్యురాలి విషయంలో కొన్ని గంటల్లోనే ఎఫ్‌ఎస్‌డీ ఆర్డర్ ఎలా ఇచ్చారని వైద్యవర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఆమె ఎప్పుడు డీపీహెచ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు? సంబంధిత హెచ్‌వోడీకి ఎప్పుడు పంపారు? కన్సెంట్ ఎప్పుడు ఇచ్చారు? వంటి వివరాలన్నీ వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

అడ్డొచ్చిన వారిపైనా వేటు

డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లను ప్రభుత్వం రద్దు చేయడాన్ని కొందరు హెచ్‌వోడీలు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వాస్తవానికి హెచ్‌వోడీలు తమ విచక్షణ మేరకు తాత్కాలికంగా కొందరు ఉద్యోగులను డిప్యుటేషన్‌పై ఇతర దవాఖానలు, ఆఫీసులకు పంపుతుంటారు. మరికొందరిని ప్రభుత్వమే ఫలానా చోట వారి సేవలు అవసరమని గుర్తించి, డిప్యుటేషన్‌పై పంపుతుంది. ఈ మేరకు జీవో కూడా విడుదల చేస్తుంది. డిప్యుటేషన్ల రద్దు నిర్ణయం వీరికి వర్తించదు. అయినా టీవీవీపీ, డీఎంఈ కార్యాలయాల్లో జీవోపై పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను తిరిగి సొంత ప్రాంతాలకు పంపినట్టు తెలిసింది. తమకు అడ్డు వస్తారనే భావనతోనే వారిని పక్కకు తప్పించినట్టు చర్చ జరుగుతున్నది.

శివబాలకృష్ణపై సర్కారుకు నివేదిక

- ఓ ఐఏఎస్ పేరును ప్రస్తావించిన ఏసీబీ
- ప్రభుత్వ అనుమతితో అతడి విచారణ?
- 15 ఫోన్లు, 31 డిజిటల్ సామగ్రి సీజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా సెక్రటరీ శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో తమ విచారణ ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు సమర్పించారు. అక్రమాస్తుల కేసులో బాలకృష్ణను అరెస్టు చేసిన ఏసీబీ... ఎనిమిది రోజులపాటు కస్టడీకి తీసుకొని అన్ని కోణాల్లోనూ విచారించింది. కస్టడీలో బాలకృష్ణ ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ప్రకారం.. ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పాత్రపై కూడా ఏసీబీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. ఆ అధికారిని కూడా విచారించేందుకు ప్రభుత్వ అనుమతి సైతం కోరినట్టు సమాచారం. వారిద్దరి మధ్య సఖ్యతతో ఎన్నో అక్రమాలు జరిగాయని నివేదించారు. సదరు ఐఏఎస్ అధికారిని తప్పనిసరిగా విచారించాల్సిందేనని ఏసీబీ పట్టుబట్టునట్టు సమాచారం. ప్రభుత్వ అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురుచూస్తున్నారు. నార్సింగిలోని 12 ఎకరాల భూమి అనుమతులపై ఆ ఐఏఎస్ అధికారిని ప్రశ్నిస్తే.. మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఏసీబీ భావిస్తున్నది. బాలకృష్ణ 8 ఏండ్లలో 15 సెల్‌ఫోన్లు, తొమ్మిది ల్యాప్‌టాప్‌లు మార్చినట్టు ఏసీబీ గుర్తించింది. బాలకృష్ణతోపాటు అతడి కుటుంబసభ్యుల నుంచి ఫోన్లు, 30కిపైగా డిజిటల్ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు ఏబీసీ తెలిపింది. శివబాలకృష్ణ ఫోన్లలోని సమాచారం, అతని బంధువుల ఫోన్లలోని సమాచారాన్ని రిట్రీవ్ చేస్తున్నారు. ఇప్పటికే సేకరించిన కాల్ డాటా రికార్డ్స్ (సీడీఆర్)ను పరిశీలిస్తున్నారు. మొత్తానికి శివబాలకృష్ణ వ్యవహారంలో ఆ సీనియర్ ఐఏఎస్‌కు నలువైపులా ఉచ్చు బిగుస్తున్నది.

కస్టడీకి శివబాలకృష్ణ తమ్ముడు..?

అన్నయ్య అక్రమాస్తుల వ్యవహారంలో తమ్ముడు శివ నవీన్‌కుమార్ అత్యంత కీలకంగా వ్యవహరించినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. అతడిని సోమవారం ఏసీబీ అధికారులు తమ కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. శివబాలకృష్ణకు బినామీలుగా ఉన్న అతడి మేనల్లుడు భరత్, మరదలను కూడా అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఏసీబీ అరెస్టుచేసిన శివ బాలకృష్ణ సోదరుడు శివ నవీన్‌కుమార్ మొదటి నుంచి ఎవరి దగ్గర ఎంత మొత్తం తీసుకోవాలి? వాటిని ఎక్కడికి మళ్లించాలి? ఎక్కడ పెట్టుబడులు పెట్టాలి? అనే వ్యవహారాలు చూస్తున్నాడు. అక్రమంగా వచ్చే నిధులను దారి మళ్లించేందుకు నవీన్‌కుమార్ రెండు డొల్ల కంపెనీలను ఏర్పాటుచేసినట్టు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలను సేకరించారు. వాటికి ఆదాయ పన్ను (ఐటీ) సైతం చెల్లించినట్టు గుర్తించారు. డొల్ల కంపెనీల్లోని పలువురు ఉద్యోగులను సైతం విచారించారని సమాచారం.

నీటి పారుదల రంగంపై నేడు అసెంబ్లీలో శ్వేతపత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల రంగంపై శాసనసభలో సోమవారం శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇప్పటికే సభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై సోమవారం చర్చ ప్రారంభంకానున్నది. దీంతోపాటు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన లోపాలపై సభలో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు అధికార కాంగ్రెస్ పార్టీ తమ సభ్యులకు ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో 'ప్రాజెక్టుల నిర్మాణం-అవకతవకలు' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగింత అంశంలో ప్రతిపక్షం చేసే విమర్శలను ఏ విధంగా తిప్పికొట్టాలనే వ్యూహంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించ తలపెట్టిన బహిరంగసభలో చేసే విమర్శలపైనా ఎదురుదాడి చేయాలని సూచించినట్టు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రాజెక్టుల నిర్మాణ లోపాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించినట్టు తెలిసింది. మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు ఈ నెల 13న ప్రభుత్వం కార్యక్రమం ఖరారు చేసి ప్రతిపక్ష పార్టీలను ఆహ్వానించినప్పటికీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ ఎమ్మెల్యేలు తిరస్కరించిన విషయం తెలిసిందే.

సీఎంను కలిసిన మాజీ మేయర్ బొంతు

హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం సాయంత్రం సీఎం నివాసానికి స్వయంగా వెళ్లి కలిశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.